# ఇదండీ మా బామ్మర్ది వరస!

"ఇవాళ మా జనరల్ మేనేజర్ (పర్సనల్)ను కలుసుకుని నా విజయవాడ పోస్టింగు గురించి మాట్లాడాలి. అక్కడి డి.ఎమ్. బెంగాలీ. అతన్ని కలకత్తా వేస్తే నా లైన్ క్లియర్ అవుతుంది. ప్రమోషన్ మీద కూడా మన రాష్ట్రంలోనే ఉండవచ్చు" హైద్రాబాద్ నుంచి వచ్చిన మా బామ్మర్ది శ్రీహరి వచ్చిన పని చెప్పాడు.

"ఎవరు మీ జనరల్ మేనేజర్? ఎక్కడ ఆయనుండేది?" అడిగాను.

"జార్జి థామస్ అని, సీనియర్ హెచ్.ఆర్.డి. ఫిగర్. బ్యాండ్‌స్టాండ్ బాంద్రాలో ఉంటారట."

"ఇంటికి వెడితే బెడిసికొట్టదు కదా! కొందరికిలాంటివి నచ్చవు" అన్నాను.

"ఆ భయం అక్కర్లేదు బావా! ఆయన బావమర్ది హైద్రాబాద్‌లో ఉన్నాడు. నాకు మంచి ఫ్రెండ్. ఆయన రికమెండేషన్ లెటర్ ఇచ్చారు."

'బావమర్ది రికమెండేషన్ తోసిపుచ్చే దమ్ములెవరికుంటాయి!' అనుకుంటూనే –

"సరే స్నానం కానియ్యి. టిఫిన్ చేసి వెళ్ళొద్దాం" అన్నాను.

నా మటుకైతే ఇలా పైరవీలు చేసే అలవాటు లేదు. వివిధ పరీక్షల్లో, ఇంటర్వ్యూల్లో పాసై, ప్రమోషన్ మీద నాలుగైదు రాష్ట్రాల్లో పనిచేసి, ఇప్పుడు జి.ఎమ్.(ఫైనాన్స్)గా కార్పొరేట్ ఆఫీసులో ఉన్నాను.

హరి 'నా' బావమర్ది కదా! నేనూ గుంపులో గోవిందా కాక తప్పదు!

అంధేరి నుండి బాంద్రా వెళ్ళడానికి ఇరవై నిమిషాల సమయం పడుతుంది. "నా కారు" యస్వీ రోడ్డు మీదుగా పోతోంది. సెలవు దినం కావడాన ట్రాఫిక్ ఎక్కువగా లేదు. హరి మా ఊరి విశేషాలు చెబుతున్నాడు. నేను 'ఊ' కొడ్తూ డ్రైవ్ చేస్తున్నాను.

కారును బాంద్రా బ్యాండ్ స్టాండ్‌లో పార్క్ చేసి అడ్రసు వెతకడానికి బయలుదేరాము.

"లోబో మాన్షన్" అని బిల్డింగ్ పేరు మాత్రం తెలుసు. ఫ్లాట్ నెంబర్ తెలియదు. చాలా షాపులు మూసి ఉన్నాయి! ఒక బేకరీ మాత్రం తెరిచి ఉంది. అక్కడ అడిగితే ఎడమ సందులోని రెండవ బిల్డింగని చెప్పారు.

"లోబో మాన్షన్" చేరి అక్కడ వాచ్‌మన్‌ని అడిగాము జార్జి థామస్ గారి ఫ్లాట్ నెంబరు ఎంతని.

"ఇక్కడ ఆ పేరున్న వారెవరూ లేరు సాబ్" అన్నాడు.

"లోబో మాన్షన్ ఇదేనా?"

"అవును సాబ్"

"మరి జార్జి థామస్ తెలియదా?"

"వారిక్కడ ఉంటే కదా సాబ్ తెలిసేది?"

మా సంభాషణ హిందీలో సాగుతోంది.

"నీకిక్కడ ఉండే వాళ్ళందరూ తెలుసా?"

"అదేమిటి సాబ్? ఆరేళ్ళ నుండి ఇక్కడ పని చేస్తున్నాను. ఇక్కడి వాళ్ళందరూ తెలియక పోవడమేమిటి? ఆ కనిపించే పింక్ కలర్ బిల్డింగ్ "లోబో క్యాసిల్", అక్కడ కనుక్కోండి.

ఇక చేసేదేం లేక "లోబో క్యాసిల్" వైపు వెళ్ళాం.

అక్కడ వాచ్‌మన్ లేడు ఏ.బి.సి.డి. అని నాలుగు వింగుల బిల్డింగ్ అది ఏ వింగులో అడగడం? ప్రతి వింగులో చూడటం తప్ప గత్యంతరం లేదు. ఫ్లాటు దారుల పేర్లున్న బోర్డులు అన్ని వింగుల్లో చూశాం. ఏ వింగులోనూ థామస్ పేరు కనపడలేదు.

ఓ ఫ్లాట్ బెల్ మోగించాం! తలుపు తెరిచిన వారిని చూసి –

"ఎక్స్‌క్యూజ్‌మి! ఇక్కడ జార్జి థామస్ గారు ఏ ఫ్లాటులో ఉన్నారు?"

"జార్జి థామస్ గారా? ఆ పేరున్న వారెవరూ ఈ బిల్డింగ్‌లో ఉంటున్నట్లు లేదే? 'వారి' పూర్తి అడ్రసేమిటి? వారితో మీకేం పని? ఎక్కడి నుంచి వచ్చారు మీరు?"

మాకు కావలసిన సమాచారం ఇస్తాడో లేదో కాని ఈయన క్రాస్ ఎగ్జామినేషనుతో చంపేసేట్టున్నాడు. అవసరం మనది కదా! జవాబివ్వక తప్పదు! అనుకుని,

"మేము హైద్రాబాద్ నుండి వచ్చామండీ, జార్జి థామస్ గారు ఫలానా కంపెనీలో జి.ఎమ్.గా ఉన్నారు. ఆయనతో పనుండి వచ్చాము."

"లోబో మాన్షన్"లో ఉంటారని చెప్పారు కానీ అక్కడ అలాంటి పేరున్న వారెవరూ లేరు.

"ఎవరినో కలుసుకోవాలని హైద్రాబాద్ నుండి వచ్చినవారు, సరియైన అడ్రసు కూడా తెచ్చుకోకపోతే ఎలా? ఇంత పెద్ద ఏరియాలో ఎలా వెతుకుతారు? ఆ జ్ఞాపకం వచ్చింది! 'లోబో విల్లా'లో ఓ థామస్ ఉన్నాడు. తను ఓ ఫార్మాస్యూటికల్ ఫర్మ్‌లో పనిచేస్తున్నానని ఓసారి చర్చిలో కలిసినపుడు చెప్పాడు. అక్కడ ట్రై చేయండి. 'లోబో విల్లా' రెండు సందులు దాటిన తర్వాత "జెరోమీ రోడ్"లో ఉంది" చెప్పాడు.

థ్యాంక్స్ చెప్పి బయటపడ్డాం.

నా కోపం నా బావమర్ది హరి మీదకు మళ్ళింది.

"పెద్ద ఉద్యోగం వెలగబెడుతున్నావ్, ప్రమోషన్ కూడా కొట్టేశావ్. సరైన అడ్రసు తీసుకురావాలని తెలీదా? పోనీ అతని ఫోన్ నెంబరైనా ఉందా?"

"లేదు బావా! ఆయన అడ్రసు, ఫోను నెంబరు నా ఆఫీసు డైరీలో రాసుకున్నాను. అది ఆఫీసులోనే మరచివచ్చాను. బిల్డింగ్ పేరు, ఏరియా మాత్రం జ్ఞాపకం ఉంది. అయినా ఇక్కడ అడ్రసు కనుక్కోవడం సులువు అని నువ్వే కదా అన్నావ్?"

నలుగురైదుగురిని అడిగి 'లోబో విల్లా' చేరుకున్నాం. అక్కడ థామస్ ఉన్నాడు కాని అతను జార్జి థామస్ కాదు! ఫలానా లేన్ లో "లోబో రెసిడెన్సీ'లో కనుక్కోండి అని అతనంటే అక్కడికి కూడా పోయాం. అలా 'లోబో'తో మొదలయ్యే అన్ని బిల్డింగులూ గాలించాం. కానీ ఫలితం శూన్యం. ఇక ఏం చేసేది?

మర్నాడు డీలర్స్ కాన్ఫరెన్స్ ఉండడం వల్ల ఆరోజే హైద్రాబాద్ తిరిగి వెళ్ళిపోవాలి. అందుకని మర్నాడు ఆఫీసులో జి.ఎమ్.ను కలుసుకోవడం కుదరదు. ఉస్సూరంటూ నా కారు దగ్గరకు వచ్చాము. అప్పటికి కొన్ని షాపులు తెరిచారు.

దాంట్లో ఓ సర్క్యులేషన్ లైబ్రరీ కూడా ఉంది. అది చూడగానే నాకో ఆలోచన వచ్చింది.

ఆ లైబ్రరీలోకి వెళ్ళి –

"మేము హైద్రాబాద్ నుండి వచ్చాము. జార్జి థామస్ గారిని కలుసుకోవాలి. ఆయన ఈ ఏరియాలో ఉంటారని తెలుసు, కానీ అడ్రసు మిస్సయింది. ఈ విషయంలో మీరేమైనా సహాయం చేయగలరా?" అని అడిగాం.

"ఫలానా కంపెనీలో జి.ఎమ్.గా పనిచేసే జార్జి థామస్‌గారు తెలుసు. వారి అమ్మాయి మా మెంబరు. వారేనా మీక్కావలసిన వారు?" అని అడిగాడు.

"ఆయనేనండీ, ఎక్కడ ఆయనుండేది?" ఆతృతగా అడిగాను.

"ఆ కుడివైపు సందులో 'లోబో మనోర్' సొసైటీ ఎదురుగా ఉన్న బంగళా వారిదే."

"మెనీ మెనీ థాంక్స్" అని బయటకు వచ్చాం.

"నేను చెప్పలా, 'లోబో మాన్షనో' ఏదో అని" హరికి హుషారొచ్చింది.

"నీవు చెప్పింది లోబో మాన్షన్ మాత్రమే, ఏదో కాదు. అదే తప్పుదారి పట్టించింది" అని లోబో మనోర్‌వైపు కదిలాం.

ఎట్టకేలకు జార్జి థామస్‌గారిని కలుసుకున్నాం.

మొదట కాస్త బెట్టు చేసినా, తన బావమరిది రికమండేషన్ వల్ల కొంతా, నా మాటలవల్ల కొంతా మెత్తబడ్డారు. మా కంపెనీకి హరి కంపెనీకి లావాదేవీలున్నాయి. మా హెచ్.ఆర్.డి. చీఫ్ ఆయన ఫ్రెండ్ కూడాను.

మొత్తం మీద మా హరి విషయంలో చేతనైనా సహాయం చేస్తానని మాటిచ్చాడు. మా హరి ముఖం వెయ్యి క్యాండిల్స్ బల్బులా వెలిగింది.

"చూశావా మా బొంబాయి మీ హైద్రాబాద్ కంటే ఎంత మెరుగో! ఇక్కడివారు ఎంత పరోపకార పరాయణులో!" అన్నాను.

హరి చిరునవ్వు నవ్వేడు. తన బొంబాయి రాక సఫలమైనందుకు ఆనందంతో ఉన్నాడు.

లంచం లేకుండా అయిన పైరవీతో, అడ్రసు కనుక్కోడానికి అయిన ఖర్చు వివరాలడిగి నవ్వింది నా శ్రీమతి.

(అన్వేషణ వారపత్రిక 2-1-1996)